
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



హైదరాబాద్‌ను
ఫార్మా హబ్‌గా మారుస్తాం
- టీఐఎఫ్ఆర్ డైరెక్టర్ కృష్ణమూర్తి
- ఐఐటీహెచ్‌తో హైడెల్‌బర్గ్ యూనివర్సిటీ భాగస్వామ్యం

7

ఉద్యోగుల కోసమే ఫెసిలిటీ సెంటర్

సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకోలేని ఉద్యోగుల సౌకర్యం కోసమే ఫెసిలిటీ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్టు సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. సంగారెడ్డిలోని ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ సెంటర్‌ను సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలింగ్ సమయం ముగిసేవరకు 60 మంది ఉద్యోగులు తమ ఓటును వినియోగించుకున్నారని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ పత్రాలను సురక్షితంగా భద్రపరచాలని ఎన్నికల అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్న వారికి ఈ నెల 27న నిర్వహించే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా యాజమాన్యాలు వెసులుబాటు కల్పించాలన్నారు.

బాలికను పరామర్శించిన కలెక్టర్

సంగారెడ్డి మండలం ఫసల్‌వాది గ్రామంలో ఇటీవల లైంగికదాడికి గురైన బాలికను సోమవారం సంగారెడ్డి కలెక్టర్ పరామర్శించారు. అన్నివిధాలా ఆదుకుంటామని, న్యాయం చేస్తామని బాలిక కుటుంబానికి హామీ ఇచ్చారు. అనంతరం అధికారులతో సమావేశమై దోషులకు కఠిన శిక్ష పడేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలని నిర్దేశించారు.



పోస్టల్ బ్యాలెట్ సెంటర్‌ను పరిశీలిస్తున్న సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డిలో శివరాత్రి వేడుకలకు గాయకులు మనో, ఎస్పీ శైలజ

గంజ్ మైదాన్‌లో మ్యూజికల్ నైట్ ఏర్పాటు చేయించిన జగ్గారెడ్డి



సంగారెడ్డిలోని గంజ్ మైదాన్‌లో శివరాత్రి సంగీత విభావరి ఏర్పాట్లను పరిశీలిస్తున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



సంగారెడ్డికి వస్తున్న ప్రముఖ గాయకులు మనో, ఎస్పీ శైలజ

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : శివరాత్రి పర్వదినం సందర్భంగా రేపు రాత్రి సంగారెడ్డి పట్టణంలోని గంజిమైదాన్‌లో సంగీత విభావరి (మ్యూజికల్ నైట్) పెద్దఎత్తున నిర్వహించనున్నారు. ఇందుకోసం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాట్లు చేశారు. ఆధ్యాత్మిక సంగీతపరంగా జగ్గారెడ్డి ఆసక్తి చూపిస్తుంటారు. గతంలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, జానకి, సుశీల, వందేమాతరం శ్రీనివాస్, జిక్కి, రామకృష్ణ, సునీత వంటి ప్రముఖ గాయకులు సంగారెడ్డిలో శివరాత్రి సందర్భంగా జరిగిన జాగరణ వేడుకలకు హాజరయ్యారు. పదేళ్ల అనంతరం జగ్గారెడ్డి అధ్వర్యంలో మరోసారి జరుగుతున్న శివరాత్రి సంగీత విభావరి కార్యక్రమానికి ప్రముఖ గాయకులు ఎస్పీ శైలజ, మనో వస్తున్నారు. ఆర్కెస్ట్రా కార్యక్రమానికి ప్రజలు భారీగా తరలివచ్చే అవకాశం ఉన్నందున గంజ్‌మైదాన్‌లో ఘనంగా ఏర్పాట్లు చేశారు. జగ్గారెడ్డి వెంట మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ తోపాజీ అనంతకిషన్, కాంగ్రెస్ నాయకులు కూన సంతోస్‌కుమార్, మహేష్ ముదిరాజ్, కిరణ్‌గౌడ్, సుధాకర్, గంగేరి శ్రీహరి తదితరులు ఉన్నారు.



రేపే కొమురవెల్లి మల్లన్నకు పెద్దపట్నం

చేర్యాల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రం కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయం మహాశివరాత్రి పర్వదినానికి సంసిద్ధమైంది. కొమురవెల్లి మల్లన్నను దర్శించుకుని ఒక్కపొద్దులతో జాగరణ చేసేందుకు భక్తులు భారీగా తరలిరానున్నారు. శివరాత్రి సందర్భంగా ఆలయంలో స్వామివారికి మహాన్యాస పూర్వక అభిషేకంతో పాటు నిరంతరం అభిషేకాలు చేయనున్నారు. యాదవపూజారు లు ఆధ్వర్యంలో జానపద కళాకృతిలో యాదవసంప్రదాయం ప్రకారం తోటబావి ప్రాంగణంలో పెద్దపట్నం వేసి స్వామివారికి కల్యాణం నిర్వహించనున్నారు.

హరహర మహాదేవ

- మహాశివరాత్రికి ఆలయాలు ముస్తాబు
- నేటి నుంచి ప్రత్యేక పూజలు.. ఆధ్యాత్మిక కార్యక్రమాలు

7

పట్టభద్రులకు 2వేలు..

టీచర్లకు 5వేలు!

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రలోభాల పర్వం
- టీచర్ ఎమ్మెల్సీకి 15 మంది పోటీ
- గ్రాడ్యుయేట్స్ బరిలో 56 మంది
- నేటితో ముగియనున్న అభ్యర్థుల ప్రచారం
- గెలుపుపై పట్టుదలతో ప్రధాన పార్టీలు
- ఆశల పల్లకీలో స్వతంత్రులు
- సార్వత్రిక ఎన్నికలను తలపిస్తున్న పోరు
- మందు, విందుతో ఓటర్లను ఆకట్టుకునే యత్నం

పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎన్నికలు సార్వత్రిక ఎన్నికలను తలపిస్తున్నాయి. 27న పోలింగ్ జరగనున్న రెండు స్థానాల్లోనూ గెలుపు కోసం ప్రధాన పార్టీలతో పాటు స్వతంత్రులు సర్వశక్తులను ఒడ్డుతున్నారు. నేటితో ప్రచారం ముగియనున్న నేపథ్యంలో ఓటర్లను ఆకట్టుకోవడానికి ప్రలోభాలకు తెరతీశారు. పోలింగ్‌కు ముందు పంపకాలపై నిఘా పెరుగుతుందని భావించి రెండ్రోజుల ముందే తాయిలాలు చేరవేస్తున్నారు.



ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, ఫిబ్రవరి 24: మెదక్-కరీంనగర్-నిజామాబాద్-ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల ఉపాధ్యాయులు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపుపై కాంగ్రెస్, బీజేపీ పట్టుదలతో ఉన్నాయి. స్వతంత్ర అభ్యర్థులు కూడా గెలుపుపై దృష్టిసారించారు. మండలిలో తమ బలం పెంచుకోవడానికి కాంగ్రెస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. గ్రాడ్యుయేట్లతో పాటు టీచర్లు సైతం తమవైపే నిలబడతారనే నమ్మకంతో బీజేపీ రెండు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. అలాగే, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మద్దతు కోసం ఆరాటపడిన పలువురు.. స్వతంత్రులుగా, ఇతర పార్టీల అభ్యర్థులుగా పోటీలో నిలిచారు.

హోరాహోరీ..

ఎమ్మెల్సీ ఎన్నికలకు పోటీ విపరీతంగా ఉంది. పట్టభద్రుల స్థానంలో 56 మంది, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ 15 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. 15 జిల్లాలు, 42 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో విస్తరించిన పట్టభద్రులు, ఉపాధ్యాయ ఓటర్లను కలవాలంటే ఆషామాషీ కాదు. గెలుపోటముల సంగతి పక్కనబెడితే ఓటర్లను ఆకర్షించడానికి అభ్యర్థులు పడుతున్న తంటాలు అన్నీఇన్నీ కావు. అందుకే ఓటర్లను ఆకట్టుకోవడానికి ప్రలోభాలకు తెరతీశారని సమాచారం. ఆరేళ్ల పాటు పదవిలో ఉండొచ్చనే ఆశతో అభ్యర్థులు ఎంతైనా ఖర్చు చేసేందుకు వెనుకాడడంలేదు.

ఉపాధ్యాయ ఓటర్లు 7వేల మంది

ఉమ్మడి మెదక్ జిల్లాలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లు 7వేలకు పైగా ఉన్నారు. ఇందులో వెయ్యి మంది ప్రైవేటు టీచర్లు కాగా, మిగిలినవారు మోడల్‌స్కూల్, కస్తూర్బా, గురుకుల, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, జూనియర్ కళాశాలల అధ్యాపకులు ఉన్నారు. వీరిలో ప్రైవేట్ టీచర్ల ఓట్లపై కన్నేసిన ఓ ప్రధాన పార్టీ అభ్యర్థి ఓటుకు రూ.5వేల చొప్పున పంపిణీ చేయిస్తున్నారని సమాచారం. ఆయా అభ్యర్థుల తరఫున ప్రతినిధులు ఆది, సోమవారాల్లో ఓటర్లను కలిసి ఈ మొత్తం అందజేసినట్లు తెలిసింది. ప్రస్తుతానికైతే ఒక పార్టీ అభ్యర్థి నుంచే తాయిలాలు అందినా.. నేడు, రేపు మిగిలిన అభ్యర్థులు సైతం పంపకాలకు తెర తీసే అవకాశముంది. ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఇంతకుమించిన తాయిలాలను అందిస్తారని చర్చించుకుంటున్నారు. ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులుకూడా ప్రధాన పార్టీలకు దీటుగా పంపకాలు చేయడానికి ప్రణాళిక సిద్ధం చేసుకున్నట్లు తెలిసింది. ఇదే జరిగితే ఓటు రేటు రూ.10వేల వరకు చేరినా

మిగతా 7వ పేజీలో..

ఫటా..ఫట్..

అడిగిన వారందరికీ ఉపాధి

- ఉపాధిహామీ జహీరాబాద్ క్లస్టర్ ఏపీడీ పూజ

జహీరాబాద్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): అడిగిన ప్రతీ ఒక్కరికి ఉపాధిహామీ పథకంలో పని కల్పిస్తున్నామని ఉపాధి హామీ పథకం క్లస్టర్ ఏపీడీ పూజ పేర్కొన్నారు. జహీరాబాద్‌కు వచ్చిన సందర్భంగా ఆమె 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.



ఏపీడీ పూజ

ఉపాధిహామీలో ఏ పనులు చేయిస్తున్నారు ?

వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో అడిగిన వారందరికీ పనులను కల్పిస్తున్నాం. వ్యవసాయ అనుబంధ పనులకు ప్రాధాన్యమిస్తున్నాం. చేలలో రాళ్లు, పొదలను తొలగించి చదును చేస్తున్నాం. దళితుల భూముల అభివృద్ధికి కృషిచేస్తున్నాం. భూములను అభివృద్ధి చేసుకోవాలనుకునే దళితులు ఫీల్డ్ అసిస్టెంట్‌ను, ఏపీవో లేదా ఎంపీడీవోను సంప్రదించాలి. జిల్లాలో 100 మంది రైతులు దరఖాస్తు చేసుకోగా పనులను చేయిస్తున్నాం.

క్లస్టర్ పరిధిలో ఎంతమంది పని చేస్తున్నారు?

జిల్లాలో 8 మండలాల్లో ఇప్పటివరకు 4,500 మంది కూలీలు ఉపాధిహామీ పనులు చేస్తున్నారు. మండలాల వారీగా జహీరాబాద్ 369, ఝరాసంగం 1,122, మొగుడంపల్లి 167, కోహీర్ 568, సదాశివపేట 665, మునిపల్లి 289, న్యాల్‌కల్ 364, కొండాపూర్ 721 మంది పనిచేస్తున్నారు.

కూలీలకు ఏలాంటి సూచనలు ఇస్తున్నారు?

ప్రతీరోజు ఓ గ్రామంలో పర్యటిస్తూ ఉపాధి పనులు చేస్తున్న కూలీలను పలుకరించి ఇబ్బందులు తెలుసుకుంటున్నా. పనుల్లో పురోగతి పెంచాలని ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి సిబ్బందికి సూచిస్తున్నా. మధ్యాహ్నం వరకు పనులు పూర్తిచేసుకోమని సూచిస్తున్నా.

పని ప్రదేశాల్లో కల్పిస్తున్న సౌకర్యాలేమిటి?

ఉపాధిహామీ పనిచేసే కూలీలకు పనిచేసే ప్రదేశాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. తాగునీరు, ఎండ నుంచి నీడ కోసం టెంట్లు, మెడికల్‌కిట్ ఏర్పాటు చేయాలని గ్రామ పంచాయతీలను కోరుతున్నాం.

ఇందిరమ్మ ఇళ్ల కల సాకారం

- ఎమ్మెల్సీ ఎన్నికల అనంతరం ఎంపిక చేసిన గ్రామాల్లో పనులు షురూ
- రూ. ఐదు లక్షల బడ్జెట్‌లోనే నిర్మించేందుకు కసరత్తు
- మేస్త్రీలు, అధికారులు, లబ్ధిదారులకు ప్రత్యేకంగా శిక్షణ
- కోడ్ ముగియగానే కార్యాచరణ





మెదక్ ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ మోడల్ హౌస్, ఇంటి ప్లాన్

మెదక్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పనులు మెదక్ జిల్లాలో త్వరలో ప్రారంభం కానున్నాయి. ఎమ్మెల్సీ ఎన్నికలు ఈ నెల 27న ముగిసిన వెంటనే ప్రారంభించేందుకు అధికారులు ప్రణాళిక రూపొందించారు. తక్కువ ఖర్చుతో మన్నికలో రాజీలేకుండా నిర్మించడానికి నిపుణులతో మేస్త్రీలు, పంచాయతీ కార్యదర్శులు, లబ్ధిదారులకు ఆధునిక టెక్నాలజీపై శిక్షణ ఇప్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. మొదటి దశలో మండలానికో గ్రామం చొప్పున ఎంచుకుని 1,555 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేశారు. ప్రతీ లబ్ధిదారుడికి 400 చదరపు అడుగుల స్థలం తప్పనిసరి. ముందుగా జిల్లాలో తొమ్మిది ప్రాంతాల్లో ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణాలను చేపట్టినట్లు ప్రాజెక్ట్ డైరెక్టర్ మాణిక్యం తెలిపారు. ఈక్రమంలో మండలానికి ఇద్దరు మేస్త్రీల చొప్పున ఎంచుకుని వారికి మూడు రోజుల పాటు శిక్షణ ఇప్పించనున్నారు. వీరితో పాటు లబ్ధిదారులు, పంచాయతీ కార్యదర్శులను సైతం శిక్షణలో పాల్గొంటారని అధికారులు తెలిపారు.

కేటాయించిన బడ్జెట్‌లో పూర్తయ్యేలా..

గత ప్రభుత్వం డబల్‌బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలకు కేటాయించిన నిధులు సరిపోక అనేక ప్రాంతాల్లో అసంపూర్తిగా ఉండిపోయాయి. నాణ్యతపైనా విమర్శలు వచ్చాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రస్తుత ప్రభుత్వం విమర్శలకు తావివ్వకుండా ఇళ్లు పూర్తిగా నిర్మించి ఇవ్వాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కేటాయించిన రూ.5 లక్షల్లో ఇంటి నిర్మాణం పూర్తిచేసేందుకు నిపుణుల సూచనలు, సలహాలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. ఇంటి నిర్మాణానికి డబ్బును నేరుగా లబ్ధిదారుడి బ్యాంకు ఖాతా లోనే జమ చేయనున్నారు. ఇళ్లు పదికాలాలు పటిష్ఠంగా ఉండేలా నిర్మాణ సమయంలో సాంకేతిక నిపుణులు నిరంతరం పర్యవేక్షణ చేయనున్నారు.



ఫిర్యాదులకు ప్రత్యేక వెబ్‌సైట్

జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల కోసం 1.93 లక్షల మంది ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నారు. ఇటీవల గ్రామసభలు నిర్వహించి అర్హుల పేర్లను ప్రకటించారు. జాబితాలో లేనివారి కోసం మళ్లీ దరఖాస్తులు స్వీకరించారు. ఇక సర్వే జరుగుతున్న సమయంలో అందుబాటులో లేనివారు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. వారి నుంచి ఫిర్యాదులు స్వీకరించడానికి ప్రభుత్వం ప్రత్యేక వెబ్‌సైట్‌ను తీసుకువచ్చింది. గూగుల్‌లో ఇందిరమ్మ ఇళ్లు, తెలంగాణ.గవ్.ఇన్ వెబ్‌సైట్‌ను నమోదు చేయగానే పేజీ ఓపెన్ అవుతుంది. అందులో అప్లికేషన్ సెర్చ్‌ను ఎంపిక చేసుకోవాలి. ఫోన్‌నెంబరు, ఆధార్‌కార్డు, అప్లికేషన్ ఐడీ, రేషన్ కార్డులలో ఏదేని ఒక దాని వివరాలు నమోదు చేస్తే ఓటీపీ వస్తుంది. ఓటీపీ ఎంటర్ చేయగానే కంప్లెయింట్ పేజీ తెరుచుకుంటుంది. ఆ తర్వాత ఆధార్ నంబరు ఎంట్రీ చేస్తే ఫిర్యాదుదారుడి వివరాలు నమోదవుతాయి. ఫిర్యాదుల ఆప్షన్ ఎంచుకొని కేటగిరి సెలక్ట్ చేసుకుని, సమస్యను ఎంచుకుని ఫిర్యాదు వివరాలు పేర్కొనాల్సి ఉంటుంది. అనంతరం ఏదైనా ధ్రువపత్రాన్ని అప్‌లోడ్ చేసి సబ్‌మిట్ చేస్తే సెల్‌ఫోన్‌కు ఫిర్యాదు నంబర్ వస్తుంది. తర్వాత కొద్ది రోజులకు ఫిర్యాదు వివరాలు తెలుసుకోవచ్చును.

ఉత్తరాఖండ్‌లో శిక్షణలో మెదక్ కలెక్టర్ ఉపన్యాసం

ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని ముస్సోరిలోని నేషన్ ఫర్ గుడ్ గవర్నెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో వివిధ దేశాల సివిల్ సర్వీసెస్ అధికారుల శిక్షణలో మెదక్‌కలెక్టర్ రాహుల్‌రాజ్ పాల్గొని స్థానిక పాలనా సామర్థ్యాల పెంపుపై అతిథి ఉపన్యాసం చేశారు. రాష్ట్రంలో అమలవుతున్న స్థానిక పాలనపై తన అనుభవాలను పంచుకున్నారు. ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు.

-మెదక్ అర్బన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి)



సర్కారు బడుల్లో ఏఐ ఆధారిత బోధన

పైలెట్ ప్రాజెక్టుగా మెదక్ జిల్లా

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): సర్కారు బడుల్లో ప్రాథమిక విద్యను బలోపేతం చేసుకోవడానికి ప్రభుత్వం కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పైలెట్ ప్రాజెక్టుగా మెదక్ జిల్లాను ఎంపిక చేసింది. కృత్రిమ మేధ సాయంతో విద్యార్థులను ఆకట్టుకునేలా సులభ రీతిలో వినూత్న బోధనను సోమవారం జిల్లా వ్యాప్తంగా ఆరు మండలాల్లోని ఆరు పాఠశాలల్లో ప్రారంభించింది. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో 3, 4, 5 తరగతుల విద్యార్థులు తెలుగు బాగా చదివేలా కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) సాయంతో ఆకట్టుకునేలా పాఠ్యాంశాలు బోధిస్తారు. పైలెట్ ప్రాజెక్టు పర్యవేక్షణకు సంబంధించి బెంగళూరుకు చెందిన 'ఏక్ సెప్ట్' సంస్థతో రాష్ట్ర సర్కారు ఒప్పందం కుదుర్చుకుంది. ఆ సంస్థ ఆధ్వర్యంలో తమిళనాడు రాష్ట్రంలో చేపట్టిన కార్యక్రమం సత్ఫలితాలిస్తోంది. ఇదే స్ఫూర్తితో ప్రభుత్వం రాష్ట్రంలోని 6 జిల్లాల్లో.. ఒక్కో జిల్లాకు ఆరు చొప్పున ప్రాథమిక పాఠశాలలను ఎంపిక చేసి ఏఐ ఆధారిత పాఠాలు బోధించే ఏర్పాట్లు చేసింది. కంప్యూటర్లు, ఇంటర్నెట్ సదుపాయాలను కల్పించింది. పైలెట్ ప్రాజెక్టు విజయవంతమైతే ఈ విధానాన్ని అన్ని పాఠశాలలకు వర్తింపజేసే యోచనలో సర్కార్ ఉంది.



మాసాయిపేటలో ప్రత్యేక బోధనను పరిశీలిస్తున్న డీఈవో రాధాకిషన్

ఎంపిక చేసిన పాఠశాలు

1. ఎంపీపీఎస్, బూర్గపలి(హవేళీఘణపూర్)
2. ఎంపీసీఎస్(నిజాంపేట),
3. ఎంపీపీఎస్-2 (నర్సాపూర్)
4. ఎంపీపీఎస్(తూప్రాన్)
5. ఎంపీపీఎస్(మసాయిపేట)
6. ఎంపీపీఎస్(కౌళకల్)

ప్రత్యేక బోధన కార్యక్రమం ఇలా..

ప్రతీ పాఠశాలలో ఇంటర్నెట్ సదుపాయంతో 5 చొప్పున కంప్యూటర్లు ఏర్పాటు చేశారు. 3, 4, 5వ తరగతిల్లో వెనుకబడిన విద్యార్థులను ఐదుగురి చొప్పున బృందాలుగా చేశారు. తెలుగు వాచకం, గణిత అభ్యసనాలపై 20 నిమిషాల వ్యవధితో ఏఐ పాఠాలను బోధించేలా కార్యాచరణ రూపొందించారు. ప్రతీ 20 నిమిషాలకు ఒక బ్యాచ్ చొప్పున పాఠశాల పనివేళల్లో ప్రత్యేక తరగతులను నిర్వహిస్తారు. ప్రతీ విద్యార్థి అభ్యసన సామర్థ్యాలను వారి ముదింపు చేస్తారు. తుది ఫలితాలపై తల్లిదండ్రులతో కలెక్టర్, విద్యాశాఖ అధికారులు సమావేశమై, వివరాలను రాష్ట్ర విద్యాశాఖకు నివేదిస్తారు.

ఏఐతో మెరుగైన బోధన

ఏఐ ఆదారిత బోధనకు మెదక్ జిల్లాను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. జిల్లా వ్యాప్తంగా ఆరు పాఠశాలల్లో కృత్రిమ మేధ సాయంతో విద్యార్థులకు ప్రత్యేక తరగతుల ద్వారా బోధన ప్రారంభమైంది. దీంతో, విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు మెరుగుపడనున్నాయి. సర్కారు బడుల్లో ప్రైవేటు స్కూళ్ల కంటే మెరుగైన విద్యాప్రమాణాలు ఉంటాయి.

-రాధాకిషన్, మెదక్ డీవో

కత్తితో బెదిరించి పుస్తెలతాడు చోరీ

కొండపాక, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : మహిళ మెడలో నుంచి పుస్తెలతాడు చోరీ చేసి వెళ్తుండగా. దొంగను స్థానికులు పట్టుకున్న సంఘటన కొండపాక మండలం తిమ్మారెడ్డిపల్లి శివారులోని రాజీవ్ రహదారిపై సోమవారం చోటుచేసుకుంది. తిమ్మారెడ్డిపల్లి పరిధిలోని సార్లపల్లి గ్రామానికి చెందిన మల్లం నరసింహులు ఇంట్లో శుభ కార్యక్రమం ఉండగా. వారి బంధువు నంగునూరుకు చెందిన సుగుణ ఆదివారం వచ్చింది. సోమవారం ఉదయం తిరిగి వెళ్లేందుకు సార్లవాడ నుంచి కొమరవెల్లి కమాన్ వద్దకు నడుస్తున్నది. ఈ క్రమంలో ఆమెను వెంబడిస్తూ వచ్చిన ఒక వ్యక్తి కత్తి చూపి బెదిరించి.. మెడలోని పుస్తెలతాడు తెంపుకుని పరారయ్యాడు. దాంతో ఆమె అరుపులు వేయడంతో అక్కడే ఉన్న స్థానికులు వెంబడించి చోరీకి పాల్పడిన వ్యక్తిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

ఏటీఎంలో చోరీకి యత్నం



వివరాలు సేకరిస్తున్న ఎస్‌ఐ

నర్సాపూర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ పట్టణంలోని ప్రధాన రోడ్డుపై గోల్డెన్ చికెన్ సెంటర్ సమీపంలో ఉన్న యాక్సిస్ బ్యాంకుకు చెందిన ఏటీఎంలో తర్వాత చోరీకి యత్నించి విఫలమైనట్లు ఎస్‌ఐ లింగం తెలిపారు. ఆదివారం అర్ధరాత్రి కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ఏటీఎంలోకి చొరబడి, డబ్బులు తీసుకోవడానికి ప్రయత్నించగా.. ఎంతకూ రాకపోవడంతో విఫలం చెంది వెళ్లిపోయారు. బ్యాంకు అధికారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో ఐదుగురి మృతి

గజ్వేల్ రూరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : పాత ఇంటికి మరమ్మతులు చేస్తున్న క్రమంలో పైకప్పు కూలి ఒకరు మృతిచెందారు. గజ్వేల్ మండలం అనంతరావుపల్లి గ్రామానికి చెందిన ఆకుల(దావనమైన) ఎల్లయ్య(45) తన ఇంటి మరమ్మత్తులో భాగంగా పాత గోడలు తీస్తున్నాడు. ఈ క్రమంలో ఇంటి పైకప్పు కూలి తలకు బలంగా తాకడంతో ఎల్లయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి బాధిత కుటుంబాన్ని పరామర్శించి, సానుభూతి తెలిపారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి..

హవేళిఘణపూర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : చేపలవేటకు వెళ్లిన వ్యక్తి మృతిచెందాడు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం మోరాబాద్ జిల్లా ఉమ్రికలాన్ గ్రామానికి చెందిన మహ్మమద్ షాదాబ్(37) బతుకుదెరువు కోసం మెదక్ పట్టణానికి వచ్చి, కూలీ పనులు చేస్తూ జీవించేవాడు. 20న చేపలు పట్టేందుకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పాడు. కాగా సోమవారం మండల పరిధి ఫరీద్‌పూర్ శివారులోని మంజీరా నదిలో శవమై కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి గజ ఈతగాళ్లతో మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు.



మాదారంలో మృతిచెందిన యాచకుడు

గుర్తు తెలియని వ్యక్తి..

సంగారెడ్డి క్రైం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లా జనరల్ ఆసుపత్రిలో గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందినట్టు పట్టణ సీఐ ఎస్.రమేష్ తెలిపారు. సంగారెడ్డి పట్టణంలోని కొత్తబస్టాండ్ ప్రాంతంలో 42 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి మూర్ఛతో పడిపోవడంతో స్థానికుల సమాచారం మేరకు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందినట్టు సీఐ తెలిపారు. మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచామని చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

చికిత్స పొందుతూ యువతి..

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : చికిత్స పొందుతూ యువతి మృతిచెందిన సంఘటన సిద్దిపేట అర్బన్ మండలం బక్రిచెప్యాల గ్రామశివారులో గల పూజా పౌల్ట్రీఫాంలో చోటుచేసుకుంది. బీహర్‌కు చెందిన రాజుకుమార్ తన ముగ్గురు కుమారులు, ఒక కూతురుతో బతుకుదెరువు నిమిత్తం నెలరోజుల క్రితం పూజా పౌల్ట్రీ ఫాంకు వచ్చాడు. కూతురు నిశాకుమారి(17) కొద్దిరోజుల క్రితం కడుపునొప్పితో బాధ పడుతుండడంతో ఆస్పత్రికి తరలించాడు. అయినా ఫలితం లేకపోవడంతో నిశాకుమారి జీవితంపై విరక్తి చెంది శుక్రవారం చికెన్ కూరలో ఎలుకల మందు కలుపుకుని తిన్నది. గమనించిన కుటుంబీకులు ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందింది. తండ్రి రాజ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

మాదారంలో యాచకుడు..

జిన్నారం, ఫిబ్రవరి, 24 (ఆంధ్రజ్యోతి) : జిన్నారం మండలం మాదారంలో గుర్తు తెలియని యాచకుడు మృతిచెందాడు. సోమవారం రాత్రి గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తి మరణించినట్లు స్థానికులు గుర్తించారు. మృతుడి వయస్సు (60) ఉంటుందని, స్థానికంగా యాచకుడిగా జీవిస్తున్నాడు. స్థానికుల సమాచారంతో సీఐ రవీందర్‌రెడ్డి ఘటనా స్థలాన్ని సందర్శించి, కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తరలించారు.

భజన కీర్తి పతాక వరకవి సిద్ధప్ప

జిజ్ఞాస ప్రాజెక్ట్‌లో భాగంగా విద్యార్థుల పరిశోధన.. రాష్ట్రస్థాయికి ఎంపికైన ప్రాజెక్టు

సిద్దిపేట కల్చరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట డిగ్రీ కళాశాల తెలుగుశాఖ విద్యార్థుల జిజ్ఞాస ప్రాజెక్ట్‌లో భాగంగా వరకవి సిద్ధప్ప రచనల తాత్త్వికత, భజనమండళ్ల సేవ అనే ప్రాజెక్టు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయింది. హైదరాబాద్‌లోని నాంపల్లి ఇందిరా ప్రియదర్శిని కళాశాలలో మార్చి 5న జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో ఈ ప్రాజెక్టును ప్రదర్శించనున్నారు. జిల్లాలోని కోహెడ మండలం గుండారెడ్డిపల్లికి చెందిన రాజయోగి వరకవి సిద్ధప్ప తెలంగాణ తొలితరం పారమార్థిక యోగులలో ఒకరు. వీరి కీర్తనలు, పద్యాలు తెలుగు ప్రాంతాలు నలుమూలలా విశేష ప్రాచుర్యం పొందాయి. తెలంగాణవ్యాప్తంగా సిద్ధప్ప శిష్యులు, ప్రశిష్యుల నిర్వహణలో ఆశ్రమాలు ఉన్నాయి. వీరు సిద్ధప్ప రచనల్లోని తాత్విక చింతన.. సంఘ సంస్కరణలు, నైతిక విలువలు వంటి వాటిని ప్రచారం చేస్తున్నారు. ఇవి నేటి సమాజానికి ఎలా అవసరం అనే అంశంపై విద్యార్థులు అధ్యయనం చేసి ప్రాజెక్ట్ రూపొందించారు. తెలుగు శాఖ అధ్యక్షుడు డా. మట్టా సంపత్ కుమార్ రెడ్డి పర్యవేక్షణలో పరిశోధక విద్యార్థులు పవన్ ప్రహ్లాద్, భాను ప్రసాద్, పూజిత, నిఖిత, రాజు, భార్గవి సిద్ధప్ప ఆశ్రమాన్ని.. ఆయన కుమారుడిని, పలువురు ఆయన శిష్యులను కలిసి సమాచారం సేకరించారు. ఈ పరిశోధనలో విద్యార్థులకు పర్యవేక్షకుడితోబాటు, తెలుగుశాఖ అధ్యాపకులు పిట్ల దాసు, నారోజు వెంకటరమణ, కడారిసాయి సురేశ్ అవసరమైన ప్రోత్సాహాన్ని అందించారు.


సిద్ధప్ప కుమారుడు మాణిక్య లింగం వద్ద వివరాలు సేకరిస్తున్న జిజ్ఞాస బృందం


కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని లాయర్లు, టీచర్లను కోరిన నిర్మలజగ్గారెడ్డి

ఎన్నికల ఇన్‌చార్జులు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, టీజీయూఎఫ్ఐడీసి చైర్మన్ చల్లా నరసింహారెడ్డిలతో కలిసి ప్రచారం చేసిన టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలజగ్గారెడ్డి

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా సంగారెడ్డి జిల్లా కోర్టు, ప్రైవేటు స్కూల్‌లల్లో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలజగ్గారెడ్డి సోమవారం ప్రచారం నిర్వహించారు. మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, టీజీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డిలతో కలిసి నరేందర్‌రెడ్డికి ఓటు వేయాలని లాయర్లు, టీచర్లను ఆమె అభ్యర్థించారు. సీరియల్ నంబర్ 2కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ ఆంజనేయులు, సీడీసీ చైర్మన్ రామ్‌రెడ్డి, ఆత్మకమిటీ చైర్మన్ ప్రభు, కాంగ్రెస్ నాయకులు కూనసంతోష్, కిరణ్‌గౌడ్, మహేశ్, వెంకట్, కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి, అడ్వకేట్‌లు అల్లూర్ సంగమేశ్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థికి ఓటు వేయాలని ప్రైవేటు పాఠశాలలో ప్రచారం చేస్తున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలజగ్గారెడ్డి


కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి ఓటు వేయాలని న్యాయవాదులను కోరుతున్న టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలజగ్గారెడ్డి



కంప్యూటేషనల్ కెమిస్ట్రీ కేంద్రాన్ని ప్రారంభించిన హైడెల్‌బర్గ్

హైదరాబాద్‌ను ఫార్మా హబ్‌గా మారుస్తాం

- టీఐఎఫ్ఆర్ డైరెక్టర్ కృష్ణమూర్తి
- ఐఐటీహెచ్‌తో హైడెల్‌బర్గ్ యూనివర్సిటీ భాగస్వామ్యం

కంది, ఫిబ్రవరి 24: హైదరాబాద్‌ను ఫార్మా హబ్‌గా మార్చి, విద్యార్థులకు ఆధునాతన రసాయన విద్యను అందిస్తామని టీఐఎఫ్ఆర్ (టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంట్ అండ్ రీసెర్చ్) హైదరాబాద్ కేంద్ర డైరెక్టర్ కృష్ణమూర్తి అన్నారు. ఇండో-జర్మన్ సహకారంతో కంప్యూటేషనల్ కెమిస్ట్రీపై పరిశోధనలు జరిపేందుకు సోమవారం సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్‌తో జర్మనీలోని హైడెల్‌బర్గ్ యూనివర్సిటీ భాగస్వామ్యమైంది. రసాయన పరిశోధన, విద్యా మార్పిడి, ఉపాధి, ఆవిష్కరణలు, సాంకేతికత బదిలీ కోసం ఐఐటీహెచ్‌లో ఐదు రోజులు పాటు ప్రత్యేక వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నారు. ఇందుకోసం హైడెల్‌బర్గ్ విశ్వవిద్యాలయ ఇద్దరు ఉపాధ్యక్షుల నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల ప్రతినిధి బృందం ఫిబ్రవరి 24 నుంచి 28 వరకు ఐఐటీహెచ్‌లో ఉండి ఇక్కడి విద్యా విధానాలు, పరిశోధనలపై అధ్యయనం చేయనున్నారు. కార్యక్రమంలో ఐఐటీహెచ్ డీన్ నరహరిశాస్త్రీ తదితరులు పాల్గొన్నారు.


వర్క్‌షాప్‌లో గీతం బృందం

గీతంలో కళా భవన- ఆలోచనల కళ

పటాన్‌చెరు రూరల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్‌లో 'కళా భావన- ఆలోచనల కళ' అంశంపై రెండు రోజుల పాటు నిర్వహించిన వర్క్‌షాప్ సోమవారం ముగిసింది. రమ్య గీతిక, ఏ.సంకీర్తన కార్యక్రమ సమన్వయ కర్తలుగా వ్యహరించారు. విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలు పెంచేందుకు ఈ వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ప్రముఖ ఆర్కిటెక్ట్, అర్బన్ డిజైనర్, నాగపూర్‌లోని ప్రియదర్శిని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆర్కిటెక్చర్ అండ్ డిజైన్ స్టడీస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నిశాంత్ హెచ్ మనాపురే ప్రధాన శిక్షకుడిగా వ్యవహరించారు.

అరుదైన కాల భైరవుడు



చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సోమేశ్వరాలయంలో అరుదైన కాల భైరవుడి విగ్రహాన్ని గుర్తించినట్లు ఔత్సాహిక చరిత్ర పరిశోధికుడు, కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యుడు కొలిపాక శ్రీనివాస్ తెలిపారు. చోళుల నాటి ఈ ఆలయంలో సందర్శించిన సమయంలో ఇక్కడి కాల భైరవుడి విగ్రహం అరుదైనదిగా గుర్తించినట్లు తెలిపారు. చతుర్భుజుడైన కాలభైరవుడు జటాఝూటంతో వెనుక చేతిలో కత్తి, రక్త పాత్రలతో కాళ్లకు, దండ రెట్టలకు కడియాలు, మెడలో కపాల మాల, సర్వాంగ సుందరాంగి చెక్కి ఉన్న ఈభైరవుడు చాళుక్యుల కాలానికి చెందినదిగా గుర్తించామన్నారు. భైరవుని శిల్పాలు చాలా ఉన్నాయని, ఈ శిల్పంలో అదనంగా భైరవుడి కుడివైపున భైరవ శిల్పం చెక్కి ఉండడం అరుదైన విషయం అని తెలిపారు.

పట్టభద్రులకు 2వేలు.. టీచర్లకు 5వేలు!

(5వ పేజీ తరువాయి)

ఆశ్చర్యపోనక్కర్లేదు. నగదు పంపకాలకు తోడు ఇప్పటికే పలుమార్లు విందులు సైతం ఇచ్చారు. ఉపాధ్యాయ ఓటర్లంతా పట్టభద్రుల ఎన్నికల్లోనూ ఓటర్లు కావడంతో అటువైపు నుంచి కూడా ఎంతో కొంత అందుతుందని ఆశిస్తున్నారు.

పట్టభద్రులకు పిలుపు

సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్లు 67వేల మంది ఉన్నారు. వీరందరి ఫోన్ నంబర్లను అభ్యర్థులు ఇప్పటికే సేకరించారు. నిత్యం వాయిస్ మెయిల్స్, ఫోన్ కాల్స్, మెసేజ్‌ల ద్వారా అభ్యర్థులకు తమ వాణి వినిపిస్తున్నారు. ఎంత ఊదరగొట్టినా సరైన స్పందన లేకపోవడంతో మరోదారిని ఎంచుకుంటున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులతోపాటు స్వతంత్రులుగా బరిలో ఉన్న ఒకరిద్దరు ఖర్చుకు వెనకాడకుండా ఓటర్లను ఆకర్షించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఓ పార్టీ అభ్యర్థి 10 మంది ఓటర్లకు ఓ ఇన్‌చార్జిని చొప్పున నియమించుకుని ఓటుకు రూ.2వేల చొప్పున అందజేస్తున్నారని తెలిసింది. మరో అభ్యర్థి ఓటర్లకు విందులు ఏర్పాటు చేసి, అక్కడ రూ.2 వేల చొప్పున ప్లాన్ చేసుకున్నాడని సమాచారం. ఇతర ప్రాంతాల్లో ఉంటున్న ఓటర్లకు సైతం పిలుపు వస్తున్నది. ప్రయాణ ఛార్జీలు చెల్లించడంతోపాటు నగదు కూడా ఇస్తామని చెప్పి వారిని రప్పించేందుకు ప్రయత్నిస్తున్నారు. పే యాప్ నంబర్లను సేకరించి ఆన్‌లైన్‌లో ఆడ్వాన్స్‌గా డబ్బులు పంపుతున్నట్టు సమాచారం. మరోవైపు ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థుల తరఫున ఆయా పార్టీల నేతలు ముమ్మురంగా ప్రచారం చేస్తుండడం, స్వతంత్ర అభ్యర్థుల అనుచరులు సైతం హోరాహోరీగా ప్రచారం చేస్తుండడంతో సార్వత్రిక ఎన్నికలను తలపిస్తున్నాయి. గ్రాడ్యుయేట్స్, టీచర్ల ఎన్నికలను ఈసారి ఖరీదైన ఎన్నికలుగా మార్చారని.. గతంలో ఈ పరిస్థితి లేదని ఆయా వర్గాలు ముక్కున వేలేసుకుంటున్నారు.

హరహర మహాదేవ

మహాశివరాత్రికి ఆలయాలు ముస్తాబు

నేటి నుంచి ప్రత్యేక పూజలు.. కార్యక్రమాలు

శివ.. శివ శంకర.. భక్తవ శంకర
శంభో హరహర.. నమో నమో..
హరహర మహాదేవ..

అంటూ శైవక్షేత్రాలు మారుమోగనున్నాయి. మహాశివరాత్రిని పురస్కరించుకుని నేటి నుంచి మూడు రోజుల పాటు ఉమ్మడి జిల్లాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకాలు, పార్వతీ పరమేశ్వరుల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఇందుకోసం ఆయా ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రధాన ఆలయాలకు భక్తులు పోటెత్తనున్న నేపథ్యంలో చలువ పందిళ్లు, క్యూలైన్లు ఏర్పాట్లు చేశారు. తాగునీటి వసతితో పాటు పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. ఆయా క్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడిపించనుంది.


నాగలింగేశ్వర ఆలయం ఆవరణలో ఆకట్టుకుంటున్నశివుడి విగ్రహం

మర్పడగ క్షేత్రంలో..



కొండపాక, ఫిబ్రవరి 23 : మండలంలోని మర్పడగ విజయ దుర్గా సమేత సంతాన మల్లికార్జునస్వామి క్షేత్రంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి మూడు రోజుల పాటు వైభవంగా జరుగుతాయి. శివరాత్రి మహోత్సవాలకు దేవాలయంలో అన్ని ఏర్పాట్లు చేసినట్టు నిర్వాహకులు చెప్పెల హరినాథ శర్మ తెలిపారు. మంగళవారం గణపతి పూజ, స్వస్తివాచనం, ప్రధాన కలశ స్థాపనతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. మధ్యాహ్నం రామం భజే శ్యామలం, కృష్ణం వందే జగద్గురుం సంస్థల ఆధ్వర్యంలో విబుధ సంసర్గ మర్పడగ విజయదుర్గ పుస్తకావిష్కరణ ఉంటుంది. సాయంత్రం వాహనాలు, బండ్ల ప్రదర్శన దేవాలయం చుట్టూ తిరుగుతాయి.

జగదేవ్‌పూర్‌లో..

జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిగుల్, జగదేవ్‌పూర్, మునిగడప, చాట్లపల్లి, దౌలాపూర్, పీర్లపల్లి గ్రామాల్లో శివాలయాలు, మల్లన్న దేవాలయాలు ముస్తాబయ్యాయి. జగదేవ్‌పూర్‌లోని బ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయంలో జాతర జరగనుంది.

సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): నారాయరావుపేట మండల కేంద్రంలో స్వయంభుగా వెలిసిన బుగ్గ రాజేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా జరగనున్నాయి. ఆలయానికి తెలంగాణ నలుమూలల నుంచే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక నుంచి భక్తులు తరలివస్తారు. ఇక్కడ మూడు రోజుల పాటు ఉత్సవాలు జరగనున్నాయి. ఆలయ ప్రాంగణంలో నవగ్రహాలు, హనుమాన్ ఆలయం, బద్ది పోచమ్మ దేవాలయం, మల్లన్న దేవాలయం, దర్గా ఉన్నాయి. మహాశివరాత్రి సందర్భంగా తెల్లవారు జామున నుంచి రాత్రి 12 గంటల వరకు శివలింగం జలాభిషేకం చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

కొప్పోలు ఉమా సంగేశ్వరస్వామి చెంత..

పెద్దశంకరంపేట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొప్పోలు ఉమా సంగమేశ్వర స్వామి దేవాలయంలో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా జరగనున్నాయి. పచ్చటి పొలాలు, నిజాంసాగర్ బ్యాక్ మధ్యలో ఆహ్లాదకర వాతారణంలో గుట్టపై స్వయంబూగా వెలసిన ఉమా సంగమేశ్వర స్వామి సన్నిధిలో ఈ నెల 26 నుంచి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

దౌల్తాబాద్‌లో..

దౌల్తాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దొమ్మాట, గాజులపల్లిల్లో నూతనంగా నిర్మిస్తున్న దక్షిణ కాశీ కైలాసశ్వర ఆలయంలో బ్రహ్మశ్రీ కొడకండ్ల రామ్‌చరణ్ శర్మ ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణం నిర్వహించనున్నారు. మండల కేంద్రంలోని ఎత్తైన కొండపై వెలసిన పురాతన శ్రీ స్వయం భూ శంభు లింగేశ్వర స్వామి ఆలయంలో మూడు రోజుల పాటు జాతర జరగనుంది.

రుద్రేశ్వరాలయంలో..

కొండపాక, ఫిబ్రవరి 21: వందల సంవత్సరాల చరిత్ర కలిగిన రుద్రేశ్వరాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 25 నుంచి 27 వరకు మూడు రోజుల పాటు వైభవోపేతంగా జరుగుతాయి. మంగళవారం వారం రోజున వార్షిక బ్రహ్మోత్సవాలు గురు మదనానంద సరస్వతీ పీఠం పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామి అంకురార్పణ చేసి ఆలయ కమిటీ చైర్మన్ అనంతుల శ్యామ్ మోహన్, కార్యదర్శి వెంకటరమణ శర్మ కోశాధికారి రేణిగింది బాలయ్య తెలిపారు.

రామారం మహాదేవుని ఆలయంలో..

రాయపోల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామారం మహాదేవుని ఆలయంలో నేటి నుంచి 27 వరకు మహాశివరాత్రి ఉత్సవాలు జరపనున్నట్లు ఆలయ కమిటీ చైర్మెన్, తాజా మాజీ సర్పంచ్ వంజరి సరోజనాహన్మంత్ పేర్కొన్నారు.

ఖేడ్ కాశీ విశ్వేశ్వరాలయంలో..

నారాయణఖేడ్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఖేడ్‌లో సుమారు 300 సంవత్సరాల క్రితం నిర్మించిన కాశీ విశ్వేశ్వరాలయం శివరాత్రి ఉత్సవాలకు ముస్తామైంది. నిజాం కాలం నుంచే ఇక్కడ పూజా కార్యక్రమాలు జరిగేవి. తర్వాత కాలంలో ఆలయానికి ఆదరణ తగ్గి.. శిథిలావస్థకు చేరగా, సికింద్రాబాద్‌కు చెందిన పట్నం పవన్‌కుమార్ గౌడ్ ఆలయానికి పూర్వ వైభవం తీసుకవచ్చేందుకు జీర్ణోద్ధరణ చేయించారు. 17 ఏళ్ల క్రితం కాశీ విశ్వేశ్వరుడి విగ్రహాన్ని ప్రతిష్ఠింపజేశారు. అపపటి నుంచి రోజూ ఆలయంలో దూపదీప నైవేద్యాలు జరుగుతుండగా, శివరాత్రి రోజు ప్రత్యేక పూజలు హోమాలు జరుగుతాయి. ఈ ఏడాది మహాశివరాత్రి సందర్భంగా ఈ నెల 25 ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో శివరుద్రప్ప, ఆలయ కమిటీ చైర్మన్ భోగి హన్మండ్లు గుప్తా, పురోహితులు గురుజ్యోషి తెలిపారు.

ఏడుపాయలకు నేటి నుంచి ప్రత్యేక బస్సులు

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఏడుపాయలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపాలని నిర్ణయించింది. ఈ నెల 26 నుంచి మార్చి 1 వరకు 364 బస్సులు నడపనున్నారు. మెదక్, జోగిపేట, సంగారెడ్డి, నర్సాపూర్, బాలానగర్, సదాశివపేట, నారాయణఖేడ్, జహీరాబాద్, ఝరాసంగం, శంకరంపేట, బొడ్మట్‌పల్లి, శంకర్‌పల్లి, జేబీఎస్ తదితర ప్రాంతాల నుంచి బస్సులు నడపనున్నారు. ఝరాసంగంకు జహీరాబాద్ నుంచి 6 బస్సులు, శంకరంపేట నుంచి కొప్పోల్‌కు 4 బస్సులు, జోగిపేట నుంచి వట్‌పల్లికి 5 బస్సులు, సిద్దిపేట నుంచి వేములవాడకు అదనంగా మరో 3 బస్సులు నడపనున్నారు. ప్రత్యేక బస్సులకు 1.5 చార్జీలు అదనంగా వసూలు చేయనున్నట్లు రీజినల్ మేనేజర్ ప్రభులత తెలిపారు.

నాగలింగేశ్వరాలయంలో..

ఖేడ్ మండలం పంచగామలోని నాగలింగేశ్వర(పంచలింగేశ్వర) ఆలయంలో కులమతాలకు అతీతంగా శివరాత్రి మహోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు పీఠాధిపది కాశీనాథ్ బాబా తెలిపారు. ఏకంభ పీఠాధిపతి కరణ్ గజేంద్ర భారతి మహరాజ్ కీర్తనలు ఆలపించనున్నారు.

తుర్కపల్లి సంగమేశ్వరాలయంలో..

మండల పరిధి తుర్కపల్లిలో 30 ఏళ్ల క్రితం నిర్మించిన సంగమేశ్వర దేవాలయంలో మహాశివరాత్రి సందర్భంగా ఈ నెల 26 నుంచి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించన్నుట్లు నిర్వాహకులు తెలిపారు.

ప్రత్యేక అభిషేకాలు

పటాన్‌చెరు రూరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రూరల్ మండలంలోని రుద్రారం శ్రీ సిద్ది గణపతి దేవస్థానం శివాలయంలో మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక అభిషేకం, అన్న సంతర్పణ, శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి లావణ్య తెలిపారు.

కోహీర్ ఓంకారేశ్వరాలయంలో..

కోహీర్, ఫిబ్రవరి 24, (ఆంధ్రజ్యోతి): కహీర్‌లోని ఓంకారేశ్వరాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు శ్రీ బాగీరథీ నాగభూషణ దీక్షితులు సుహృద్భావ సంస్థ అధ్యక్షులు డా. ప్రతాప దక్షిణామూర్తి దీక్షితులు ఆధ్వర్యంలో జరగనున్నాయి.

జహీరాబాద్‌లో..

జహీరాబాద్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): జహీరాబాద్, మొగుడంపల్లి, న్యాల్‌కల్, ఝరాసంగం మండలాల్లోని శివాలయాల్లో శివరాత్రి ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేశారు. పట్టణంలోని సిద్దేశ్వరాలయంలో నేడు.. రేపు పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు అల్లాడి వీరేశం గుప్తా, అర్చక బృందం సభ్యులు తెలిపారు.

108 మందితో సామూహిక రుద్రాభిషేకం

మనూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): బాదల్‌గాం లోని భవానీ సమేత పంచలింగేశ్వర ఆలయం మహాశివరాత్రి సందర్భంగా 108 మందితో సామూహిక రుద్రాభిషేకం, సంస్కృతిక కార్యక్రమాలు, భరతనాట్యం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

మూడో ఏక శిలా ఆలయం

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే మూడో ఏకశిలా ఆలయంగా విరాజిల్లుతున్న మండల కేంద్రంలోని శ్రీ సోమేశ్వరాయలం మహా శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. ఈ నెల 26 నుంచి నాలుగు రోజులపాటు జాతర అత్యంత వైభవంగా జరుగనుంది. ఈ మేరకు మాజీ సర్పంచ్ రాజిరెడ్డి, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. చోళుల కాలం నాటి ఈ ఆలయాన్ని పున: నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల

జగదేవ్‌పూర్ - 1970

55 ఏళ్లు పూర్తి.. నేడు వార్షికోత్సవం

జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): గతంలో అక్కడి వారికి పాఠశాల విద్యే ఎక్కువ. అంతకంటే ఎక్కువ చదవాలంటే హైదరాబాద్‌కు వెళ్లాల్సి వచ్చేది. అలాంటి సమయంలో జగదేవ్‌పూర్‌లో స్థానికుల చొరవతో ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరైంది. ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్న ఈ కళాశాల 55 ఏళ్లు పూర్తి చేసుకుని.. మంగళవారం వార్షికోత్సవానికి సిద్ధమైంది. జగదేవ్‌పూర్‌లో జూనియర్ కళాశాల కావాలనే ఉద్దేశంతో ఈ ప్రాంతానికి చెందిన నరసింహారామయ్య పంతులు దివంగత ప్రధాని పీవీ నర్సింహారావు రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రిగా ఉన్న సమయంలో పట్టుబట్టి 1970లో ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు చేయించారు. దీంతో మెదక్‌తో పాటు వరంగల్, నల్గొండ జిల్లాల విద్యార్థులు ఎందరో ఈ కళాశాలలో చేరి.. ఉన్నత స్థాయికి చేరారు. విద్యాశాఖ డైరెక్టర్ ఇట్టిరెడ్డి వెంకట నరసింహారెడ్డి ఇదే కళాశాల విద్యార్థి కావడం గమనార్హం.

కార్పస్ ఫండ్ కోసం రక్తకన్నీరు నాటకం..

ప్రభుత్వ పాఠశాలలోనే మధ్యాహ్నం నుంచి కళాశాల తరగతులు నిర్వహించేవారు. కళాశాల మంజూరైన ఇందుకు అవసరమైన అధ్యాపకులను, ఇతర సదుపాయాలను పూర్తిస్థాయిలో మంజూరు చేయలేదు. దీంతో కార్పస్‌ఫండ్ సేకరించేందుకు నరసంహారామయ్య పంతులు ఆధ్వర్యంలో ప్రముఖ నటుడు నాగభూషణంతో 'రక్త కన్నీరు' నాటకం వేయించారు. అలా కార్పస్ ఫండ్ సేకరించారు. అప్పట్లో ఓ వెలుగు వెలిగిన ఈ కళాశాల పదేళ్ల క్రితం విద్యార్థులు లేక మూత పడే స్థాయికి చేరగా, అప్పటి కళాశాల ప్రిన్సిపాల్ రమేష్‌బాబుతో పాటు ప్రస్తుత ప్రిన్సిపాల్ రాజన్న, కళాశాల అధ్యాపక బృందం ప్రత్యేక చొరవ తీసుకొని విద్యార్థుల సంఖ్య పెంచారు. తర్వాత కార్పొరేట్ కళాశాలలకు దీటుగా తరగతులు స్టడీఅవర్స్, స్పోర్ట్స్ అండ్ గేమ్స్ నిర్వహిస్తున్నారు. కళాశాలలో ప్రతి 20 మంది విద్యార్థులకు ఒక కేర్ అధ్యాపకుని నియమించి, చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. రెండు మూడు నెలలకు ఒకసారి విద్యార్థి తల్లిదండ్రులు ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి, అవసరమైన సలహాలు, సూచనలు తీసుకుంటున్నారు.

నేడు 55 ఏళ్ల పండుగ

జగ దేవ్‌పూర్ ప్రభుత్వ కళాశాల 55 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం కళాశాలలో వార్షికోత్సం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రాజన్న తెలిపారు. విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సీనియర్ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఈ సందర్భంగా ఆయన వివరించారు.

న్యూస్ బాక్స్

'లైసెన్స్ ఉన్నవారే ఎరువులు విక్రయించాలి'

నర్సాపూర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఎరువులు, విత్తనాలు విక్రయించే దుకాణాల వారు కచ్చితంగా లైసెన్సు కలిగి ఉండాలని మెదక్ జిల్లా వ్యవసాయ అధికారి వినయ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం నర్సాపూర్ పట్టణంలోని పలు విత్తనాలు, ఎరువులు విక్రయించే దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాలలోని ఎరువులు, విత్తనాల నాణ్యతను పరిశీలించి స్టాకు రిజిస్టర్లను చూశారు.

'ఆత్మవిశ్వాసంతో ఒత్తిడిని జయించొచ్చు'

కొండాపూర్/నర్సాపూర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఒత్తిడిని అధిగమించి, ఆత్మవిశ్వాసంతో ముందకెళ్తే అనుకున్న లక్ష్యాలు సాధించొచ్చని వ్యక్తిత్వ వికాస శిక్షకుడు, ఇంపాక్ట్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు కొంక రాజేశ్వర్ పేర్కొన్నారు. సోమవారం గిర్మాపూర్ సోసల్ వెల్ఫేర్ పాఠశాల, కళశాల విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహించి పరీక్షలపై అవగాహన కల్పించారు. అలాగే నర్సాపూర్ జూనియర్ కాలేజీలో కృషి విజ్ఞాన గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రామకృష్ణ మఠం సహకారంతో విద్యార్థులకు ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు ఎస్‌బీఎస్ మూర్తి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

చౌటకూర్ మండల ప్రత్యేకాధికారిగా వసంతకుమారి

పుల్‌కల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : చౌటకూర్ మండల ప్రత్యేకాధికారి వసంతకుమారి నియమితులయ్యారు. జిల్లా పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకురాలిగా విధులు నిర్వహిస్తున్న వసంతకుమారిని ఈ మండలానికి ప్రత్యేకాధికారిగా నయమిస్తూ కలెక్టర్ వల్లూరు క్రాంతి ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు సోమవారం ఆమె చౌటకూర్ మండల ప్రజా పరిషతు కార్యాలయాన్ని సందర్శించారు.

ఆకట్టుకున్న 'కార్నివాల్'

నారాయణఖేడ్: ఖేడ్‌లోని ఐపీఎస్ ఇంటర్నేషల్ స్కూల్‌లో నిర్వహించిన కార్నివాల్ ప్రోగ్రాం విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో పాటు సందర్శకులను ఆకట్టుకుంది. విద్యార్థులు సబ్జెక్టుల్లోని పాఠాలను ఎంచుకుని విశ్లేషించారు. ప్రతిభచూపిన విద్యార్థులను స్కూల్ డైరెక్టర్ ఇలియాస్, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు అబినందించారు.

మహిళ అదృశ్యం

పుల్‌కల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొంగ్లూరు గ్రామానికి చెందిన శాగలేటి ప్రమీల(55) అదృశ్యమైంది. గొంగ్లూరులోనే నివాసముంటున్న ప్రమీల 18న ఇంట్లోంచి వెళ్లిపోయింది. వారంరోజుల నుంచి వెతికినా ఆచూకీ లభించలేదు. ఆచూకీ తెలిస్తే 9912833285 నంబరుకు సమాచారం అందించాలని కుటుంబసభ్యులు తెలిపారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

తమ్ముడిపై అన్న దాడి

శివ్వంపేట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఇంటి స్థలం వివాదంలో తమ్ముడిని అన్న బండతో బాదడంతో తలకపై తీవ్రగాయాలయ్యాయి. మండల పరిధిలోని నవాబ్‌పేటకు చెందిన వీరేష్, బాస్కర్ అన్నదమ్ముళ్లు. ఇంటి స్థలం వివాదంలో అన్న వీరేష్, భార్య లక్ష్మి, కొడుకులు నాగరాజ్, బబుల్ కలిసి బాస్కర్(35)ను బండరాయితో తలపై కొట్టగా తీవ్రగాయమైంది. రక్తం మరకలతోనే తండ్రి బిక్షపతితో కలిసి నవాబ్‌పేట్ నుంచి శివ్వంపేట వరకు సుమారు 10 కిలోమీటర్లు మేర కాలినడకన వచ్చి పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేశామని బాధితులు బాస్కర్ తెలిపారు.

కంప్యూటర్లు సరఫరా

సంగారెడ్డి అర్బన్: సంగారెడ్డి జిల్లాలో పీఎంశ్రీ(ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకంలో భాగంగా ఎంపికైన ప్రభుత్వ పాఠశాలలకు కంప్యూటర్లు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో పీఎంశ్రీ కింద మొదటి విడతలో 25 పాఠశాలలు ఎంపిక కాగా.. ఒక్కో పాఠశాలకు 10 డెస్క్‌టాప్ కంప్యూటర్లు, ఒక్కటి చొప్పున ప్రింటర్, 2 కేవీప యూపీఎస్‌లను రెండు చొప్పున సరఫరా కానున్నాయి. విద్యార్థులకు సాంకేతిక విద్య అందించేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకున్నాయి.ఇవేకాకుండా పలు నాన్ పీఎంశ్రీ పాఠశాలలకు సైతం విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా విద్యాశాఖ కంప్యూటర్లు సరఫరాకు చర్యలు తీసుకున్నది.

రంజాన్‌లో ముస్లింలు ఇబ్బందులు పడొద్దు

● సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ముస్లింలు పవిత్రంగా భావించే రంజాన్ మాసంలో ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా చూడాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం ఎస్పీ చెన్నూరి రూపేష్‌తో కలిసి అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. రంజాన్ మాసం సందర్భంగా ఈద్గాలు, మసీదులు ఉన్న ప్రాంతాల్లో వెంటనే శానిటేషన్ పనులు చేపట్టాలన్నారు. పట్టణాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా గ్రామీణ మంచినీటి సరఫరా, మిషన్ భగీరథ అధికారులు అవసరమైన ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. పైప్‌లైన్ లీకేజీలను గుర్తించి మరమ్మతులు చేయాలని సూచించారు. వంటగ్యాస్ కొరత లేకుండా చూడాలని పౌరసరఫరాల అధికారులను ఆదేశించారు. రంజాన్ మాసం పూర్తయ్యే వరకు ఈద్గాలు, మసీదుల వద్ద విద్యుత్ దీపాలు వెలిగేలా చూడాలని, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ సంజీవ్‌రావు, జడ్పీ సీఈవో జానకీరెడ్డి, మైనార్టీ సంక్షేమాధికారి దేవుజా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. సంగారెడ్డిలోని కలెక్టరేట్‌లో పదో తరగతి పరీక్షల నిర్వహణపై రూట్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, కస్టోడియన్లకు సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పరీక్షల నిర్వహణలో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ల పాత్ర కీలకమని తెలిపారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా విధులు నిర్వర్తించాలని, అలక్ష్యంగా ఉండరాదని సూచించారు. ఈ సమావేశంలో ఎస్పీ రూపేష్, డీఈవో వెంకటేశ్వర్లు, డీసీఈబీ సెక్రటరీ లింబాజీ పాల్గొన్నారు.

ప్రయాణికులకు ఇబ్బందులు కలుగొద్దు: ఎమ్మెల్యే



ఖేడ్ ఆర్టీసీ బస్టాండ్‌ను సందర్శించి సూచనలు ఇస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : బస్టాండ్‌కు వచ్చే ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టాలని ఆర్టీసీ అధికారులకు ఎమ్మెల్యే సంజీవరెడ్డి సూచించారు. సోమవారం నారాయణఖేడ్ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌ను ఆకస్మికంగా సందర్శించి మాట్లాడారు. బస్టాండ్ ప్రాంగణం పరిశుభ్రంగా ఉంచాలని, టైం, టేబుల్‌తో పాటు కంట్రోలర్ అందుబాటులో ఉండాలన్నారు. ప్రతి బస్సు బస్టాండ్‌కు వచ్చి ప్రయాణికులను తీసుకెళ్లడంతో పాటు రాజీవ్‌చౌక్ వరకు వెళ్లి ప్రయాణికులను తీసుకెళ్లాలన్నారు. అనంతరం పట్టణంలో ఇటీవల నిర్మించిన సీసీరోడ్లను, బైపాస్ రోడ్డును కూడా చదును చేయించినందున ఆ పనులను, సాయి బాబా ఆలయం పరిసరాల్లో సీసీరోడ్లను పరిశీలించారు. ఆయన వెంట మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దారం శంకర్, ఏసురెడ్డి, వీరయ్య, రమేష్, ఆర్టీసీ మార్కెటింగ్ మేనేజర్ పాండు, కార్గో ఇన్‌చార్జి మారుతి, తదితరులు ఉన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే

పెద్దశంకరంపేట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : పెద్దశంకరంపేట మండల పరిధిలోని మక్తలక్ష్మాపూర్‌లో నిర్మించిన శివాలయం విగ్రహ ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి పాల్గొన్నారు. వేదబ్రాహ్మణుల మంత్రోశ్చరణలతో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మాపూర్ మాజీ ఎంపీటీసీ స్వప్న శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

బీజేపీని నమ్మొద్దు: మైనంపల్లి



సమావేశంలో మాట్లాడుతున్న హన్మంతరావు

నిజాంపేట/మెదక్ అర్బన్/జహీరాబాద్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : కులం, మతం పేరుతో రాజకీయం చేస్తున్న బీజేపీని నమ్మి మోసపోవద్దని, అందరికీ అందుబాటులో ఉండే కాంగ్రెస్‌కు మొదటి ప్రాధాన్యతగా ఓటువేసి గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మండల కేంద్రంలో సోమవారం కార్యకర్తలు, పట్టభద్రులతో సమావేశం నిర్వహించి ఎమ్మెల్సీ ఎన్నికలపై నాయకులకు, ఓటర్లకు దిశానిర్దేశం చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటువేసి భారీ మెజారిటీతో గెలిపించాలని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు కోరారు. సోమవారం మెదక్ బార్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తాజామాజీ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, నాయకులు బొజ్జపవన్, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి ఓటు అడిగే హక్కు లేదని స్పోర్ట్స్ అథారిటీ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ శివసేనారెడ్డి, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు డా.సిద్ధం ఉజ్వల్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం రాత్రి పట్టణంలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు.

ఖేడ్‌లో ఉపాధ్యాయుల బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

నారాయణఖేడ్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : కరీంనగర్, నిజామాబాద్, మెదక్, అదిలాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న అశోక్‌కుమార్‌కు మద్దతుగా నారాయణఖేడ్‌లో టీఎస్‌యూటీఎఫ్, టీపీటీఎఫ్‌ల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు అశోక్, సాయిలు, నాజర్‌పటేల్, గోవింద్ పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలి: ట్రైనీ కలెక్టర్

ఝరాసంగం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 26న మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా కేతకీ ఆలయానికి కర్ణాటక, మహారాష్ట్రతో పాటు తెలంగాణ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరానున్నారని, అధికారులు విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని ట్రైనీ కలెక్టర్ మనోజ్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రమైన ఝరాసంగంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆయా మండలాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ సిబ్బందితో జాతరపై సమావేశం నిర్వహించి మాట్లాడారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. 100 మంది పంచాయతీ కార్యదర్శులు, 30 మంది మున్సిపల్ సిబ్బందిని జాతర కోసం నియమించామన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ తిరుమలరావు, డీఎల్పీవో అమృత, ఎంపీడీవో సుధాకర్, ఆర్ఐ రామరావు, తదితరులు పాల్గొన్నారు.

'ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి'

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పోలీసు ప్రజావాణి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో భాగంగా ఆయన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

దళితబంధు నిధులు విడుదల చేయాల్సిందే

● బీఆర్ఎస్ నాయకుల డిమాండ్



ధర్నాలో మాట్లాడుతున్న భూపాల్‌రెడ్డి

కంగ్టి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : గత బీఆర్ఎస్ ప్రభుత్వం దళితుల సంక్షేమం కోసం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేసిన దళితబంధు పథకంలో భాగంగా మంజూరు చేసిన నిధులను సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూసోమవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నా దద్దరిల్లింది. కంగ్టి క్రాంతి చౌక్ వద్ద చేపట్టిన ధర్నాకు ఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సంఘీభావం తెలిపి మాట్లాడారు. దళితులు అన్నివర్గాల వారితో సామాజికంగా, ఆర్థికంగా ఎదగాలని బీఆర్ఎస్ పాలనలో దళితబంధు పథకం అమలు చేశారన్నారు. ఇందులో భాగంగా కేసీఆర్ లబ్ధిదారులను ఎంపిక చేసి వారి ఖాతాల్లో నిధులు జమచేశారన్నారు. ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి లబ్ధిదారుల ఖాతాల్లోకి నిధులు విడుదల చేయకుండా నిలిపేశారని, వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ర్యాలీగా వెళ్లి ఎమ్మార్వో కార్యాలయంలో లబ్ధిదారులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వెంకట్‌రెడ్డి, విశ్వనాథ్, క్రిష్ణ, సంజీవ్‌పాటిల్, అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలి

● అదనపు కలెక్టర్ మెంచు నగేష్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మెంచు నగేష్

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): శాసనమండలి ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలని, అందుకు పోలింగ్ ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని మెదక్ అదనపు కలెక్టర్ మెంచు నగేష్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఎన్నికల నిర్వహణ, పోస్టల్ బ్యాలెట్ విధానంపై ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఓపీవోలు, తహసీల్దార్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలో ఈ నెల 27న జరగనున్న ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పోలింగ్‌కు ఒకరోజు ముందు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి ఉదయం 9 గంటల వరకు చేరుకొని, తమకు కేటాయించిన సామగ్రిని సరిచూసుకోవాలన్నారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. అనంతరం అధికారుల సందేహాలను మాస్టర్ ట్రైనర్ తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి నివృత్తి చేశారు.


ఓటు హక్కు వినియోగించుకున్న ఉద్యోగులు

ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు సోమవారం కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లాలో మొత్తం 118 మంది ఉద్యోగులు ఉండగా.. 65 మంది ఓటుహక్కు వినియోగించుకున్నట్లు డీఆర్డీవో పీడీ శ్రీనివాసరావు తెలిపారు.

హస్తకళా మేళా.. భళా

● సంగారెడ్డి టీటీడీలో 'కళా సంస్కృతి' ఏర్పాటు

● మార్చి 3 వరకు వస్త్ర ప్రదర్శన



మేళాలో అమ్మకానికి ఉంచిన చేనేత వస్త్రాలు

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని టీటీడీ కల్యాణ మండపంలో కళా సంస్కృతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేనేత హస్త కళా ప్రదర్శన ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటున్నది. అఖిల భారత హస్తకళా చేనేత వస్త్ర ప్రదర్శన, అమ్మకం పేరిట ఏర్పాటు చేసిన ఈ మేళా ఈ నెల 17న ప్రారంభించగా, వచ్చేనెల 3వ తేదీవరకు కొనసాగనున్నది. అంతరించిపోతున్న హస్తకళలకు ఆజ్యం పోయాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఈ మేళాలో హస్తకళా ఉత్పత్తులు ప్రత్యేకంగా ఆకర్షిస్తుండగా, కళాకారులచే నేరుగా విక్రయిస్తున్నారు.

మల్లన్న దీవెనలతో ప్రజలు సుభిక్షంగా ఉండాలి



వెల్దుర్తి: మల్లన్న ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

వెల్దుర్తి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : మల్లన్న దీవెనలతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. మండల కేంద్రమైన వెల్దుర్తి పంచాయతీ పరిధిలోని శేరి గ్రామంలో సోమవారం జరుగుతున్న మల్లన్న జాతరలో ఎమ్మెల్యే పాల్గొని పూజలు చేసి, మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రమేష్ గౌడ్, మెదక్ మార్కెట్ మాజీ కమిటీ వైస్ చైర్మన్ కృష్ణ గౌడ్ పాల్గొన్నారు. అలాగే శేరి గ్రామంలో జరుగుతున్న జాతరలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డి పూజలు నిర్వహించారు.

ఆలయ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే

కంది, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : కంది మండల పరిధి కవలంపేట గ్రామంలోని వేంకటేశ్వరస్వామి 17వ ఆలయ వార్షికోత్సవంలో సోమవారం ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు గోశిక అనసూయావెంకటేశం చింతా ప్రభాకర్‌ను శేషవస్త్రాలతో సన్మానించారు.

మల్లన్నస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

చేగుంట ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : చేగుంట మండలం ఇబ్రహీంపూర్ యాదవ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మల్లన్న జాతరలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భ్రమరాంబికా మల్లికార్జునస్వామి ఉత్సవం



కంది: వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

రామచంద్రాపురం టౌన్ ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రామచంద్రాపురం డివిజన్ పరిధి శ్రీనివాస్‌నగర్ మందుమూల గ్రామంలో భ్రమరాంభికా మల్లికార్జున స్వామి ఆలయంలో కల్యాణోత్సవం నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యే పూజలు జరిగాయి. పట్టణంలో గంపల ఊరేగింపు జరిపారు. కార్పొరేటర్ పుష్పానగేష్ గంప ఎత్తుకొని ఊరేగింపులో పాల్గొన్నారు. పోతురాజులు తమ విన్యాసాలతో భక్తులను అలరించారు. మధ్యాహ్నం స్వామివారి కల్యాణం నిర్వహించారు. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, కార్పొరేటర్లు సింధూఆదర్శరెడ్డి, మెట్టుకుమార్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

పథకాల అమలులో కాంగ్రెస్ విఫలం: ఎమ్మెల్యే

వెల్దుర్తి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రమైన వెల్దుర్తిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రేషన్‌కార్డుల మంజూరు ఇప్పటివరకు జరగలేదని, మళ్లీ దరఖాస్తులు అంటూ కాలయాపన చేస్తుందని ప్రభుత్వం మండిపడ్డారు. కల్యాణలక్ష్మి చెక్కులు మంజూరై నెలలు గడుస్తున్నా లబ్ధిదారులకు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని అన్నారు. కొడిపల్లి సబ్ స్టేషన్‌లోని 60ఎంబీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను మరోచోటికి తరలించి 16ఎంబీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించారని, వెంటనే పాత ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. పిల్లికోట్యాల నుంచి వెల్దుర్తి మీదుగా పోతులబోగుడ వరకు బీటి నిర్మాణానికి రూ.50 కోట్లకు ప్రతిపాదన పంపించామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సమావేశంలో మాజీ జడ్పీటీసీ రమేష్‌గౌడ్, మెదక్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ క్రిష్ణ గౌడ్, మాజీ ఎంపీటీసీ మోహన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ప్రజలపై బీరప్ప, మల్లన్న ఆశీస్సులు ఉండాలి



జాతరలో నీలం మధుముదిరాజ్

పటాన్‌చెరు రూరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : బీరప్ప, మల్లన్నస్వామి ఆశీస్సులు ప్రజలపై ఉండాలని కాంగ్రెస్ నాయకుడు నీలం మధుముదిరాజ్ అన్నారు. సోమవారం ముత్తంగి గ్రామంలో జరిగిన బీరప్ప, మల్లన్న జాతరకు హాజరయ్యారు. అనంతరం ఆయనను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం అధ్యక్షుడు పుల్ల కృష్ణ, చిల్వరి శ్రీనివాస్, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో 'శ్రీ అక్షయ' ప్రతిభ



జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థినికి పుష్పగుచ్ఛం అందజేసి అభినందిస్తున్న శ్రీఅక్షయ యాజమాన్యం

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : కొండాపూర్ మండలం మల్కాపూర్ చౌరస్తా శివారులోని శ్రీఅక్షయ జూనియర్ కళాశాల విద్యార్థులు ఎన్‌టీఏ ఆధ్వర్యంలో నిర్వహించే ఆలిండియా జేఈఈ మెయిన్-2025 ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. పేపర్-2 ఫలితాల్లో కళాశాలకు చెందిన ఎస్.శ్రీవర్ష 98.24 పర్సంటైల్ సాధించారు. పేపర్-1లో అపర్ణ 92.9, అభిరాం 87.8, ఆర్.పవన్‌కుమార్ 87.29, దుర్గసాయిమనోజ్ 84.98, భాగ్యలక్ష్మి 83.3, వంశీ 82.2, శ్రీచరణ్ 81.7 వీరితో పాటు 70.0 పర్సంటైల్‌పైనా 20 మంది విద్యార్థులు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీశైలం తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్ వీరప్ప, డైరెక్టర్లు భానుచందర్‌రెడ్డి, రాజుగౌడ్, సుధాకర్‌జోషి అధ్యాపక బృందం పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

'క్రీడలతో శారీరక దృఢత్వం'

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు క్రీడల్లో పాల్గొని శారీరక దృఢత్వాన్ని పొందాలని ఇంటర్నేషనల్ ఫిజికల్ లిటరసీ అసోసియేషన్ సలహాదారు డా.అమిత్‌మాలిక్ సూచించారు. సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో సోమవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శారీరక సాక్షరతను ప్రతి ఒక్కరూ పెంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రత్నప్రసాద్, పీడీ డా.అశ్వినీరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గీతాసంస్థల చైర్‌పర్సన్‌కు బెస్ట్ విమెన్ అవార్డు



అవార్డు అందజేస్తున్న విద్యాశాఖ కమిషనర్ నర్సింహారెడ్డి

తూప్రాన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : తూప్రాన్ గీతా విద్యాసంస్థల చైర్‌పర్సన్ పీ.ఉష బెస్ట్ విమెన్ ఎంట్రెప్రెన్యూర్ అవార్డు అందుకున్నారు. రాష్ట్ర రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (టీఆర్ఎస్ఎం) సోమవారం సెమినార్ నిర్వహించింది. ఎస్ఐఎం ఎస్ఎంఐ ఆడిటోరియంలో నిర్వహించిన సెమినార్‌లో ఉషకు విద్యాశాఖ కమిషనర్ ఈవీ నర్సింహారెడ్డి, విద్యాశాఖ జాయింట్ డైరక్టర్ విజయలక్ష్మి ఈ అవార్డును అందజేశారు. ఉషను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

గులాబీ పువ్వులిచ్చి నిరసనలు

జిన్నారం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పార్యానగర్‌లో డంపుయార్డు ఏర్పాటుకు వ్యతిరేకంగా చేపట్టిన దీక్షలు 20వ రోజుకు చేరాయి. ఇందులో భాగంగా అధికారుల చేతికి పువ్వులు ఇచ్చి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. సోమవారం కొత్తపల్లి, గుమ్మడిదలలో జేఏసీ ఆధ్వర్యంలో డంపుయార్డు ఏర్పాటుకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. జేఏసీ నాయకులు, విద్యార్థులు మున్సిపల్ కమిషనర్ రఘు, తహసీల్దార్ కార్యాలయంలో ఉద్యోగులకు గులాబీ పువ్వులను అందజేసి తమ ఆందోళనకు మద్దతు తెలపాలని కోరారు.

కొనసాగుతున్న కంటి పరీక్షలు

మెదక్, కల్చరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమంలో భాగంగా ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో మెదక్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. సోమవారం సైతం జిల్లా ఆసుపత్రిలో కంటి పరీక్షలు నిర్వహించారు. ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా నేటి వరకు 64,933 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించగా.. అందులో 3,155 మంది పిల్లలు కంటి సమస్యతో బాధపడుతున్నారని, 138 మంది ఇతర కంటి సమస్యలతో బాధపడుతున్నట్టు సిబ్బంది తెలిపారు.

అథ్లెటిక్స్‌లో రాములుయాదవ్‌కు గోల్డ్‌మెడల్



అవార్డు అందజేస్తున్న విద్యాశాఖ కమిషనర్ నర్సింహారెడ్డి

కల్హేర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్‌లోని జింఖానా గ్రౌండ్స్‌లో 23న జరిగిన 7వ తెలంగాణ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో మండల పరిధిలోని ఖానాపూర్(కె) గ్రామానికి చెందిన రాములుయాదవ్ సత్తాచాటాడు. లాంగ్‌జంప్‌లో బంగారు, 200, 400 మీటర్ల పరుగు పందెంలో రజత పతకాలు సాధించాడు. రాష్ట్ర దేవాదాయ, అటవీశాఖల మంత్రి కొండా సురేఖ, మాస్టర్స్ క్రీడల ప్రధాన కార్యదర్శి రామారావ్ నుంచి పతకాలు, ప్రశంసాపత్రం అందుకున్నారు. రాములుయాదవ్ ఏప్రిల్‌లో హిమాచల్‌ప్రదేశ్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.

అంబేడ్కర్ అందరివాడు: మశ్చేందర్

నారాయణఖేడ్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : అంబేడ్కర్ అందరివాడని ఎస్ఆర్ఐ, జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ గుర్రపు మశ్చేందర్ అన్నారు. మండల పరిధిలోని రుద్రారంలో సోమవారం అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. అంబేడ్కర్ ఆర్థికవేత్త, సంఘ సంస్కర్త, కులమతాలకతీతంగా పోరాడిన మహనీయుడన్నారు.